# ముసురు



**లక్ష్మీదేవిలా ముఖాన కుంకుమతో, ఏనాడో తెగతెంపులు చేసుకున్నా ఎక్కడైనా ఉన్నాడు కదా అన్న తృప్తితో, గుండెని అదుకుంటున్నట్లుగా ఉన్న మంగళసూత్రాలతో ఉన్న వదినను ఎదురుగా పెట్టుకుని, "మీ నాన్న సంవత్సరం క్రితం పోయాడు, తల్లీ!" అని ఆమె కూతురికి ఎలా చెప్పాలి?**

సుశీల భయపడ్డంతా అయింది.

తన ఇల్లు ఇంకా పది ఇళ్ల అవతల ఉండవగానే వాన ఉధృతంగా మొదలయింది.

సుశీల ఉక్కిరిబిక్కిరి అయింది. కాళ్లు తిమ్మిరెక్కినాయి. కట్టుకున్న పెళ్లినాటి పట్టుచీర తడిసి బరువెక్కుతూ, కాళ్లను కదలనీయకుండా బంధించివేస్తున్నట్లనిపిస్తూంది. చేతిలోని కుంకుమ భరిణ వేళ్ల నడుమ బిగుసుకుపోతూంది.

కడుపులో కదులుతున్నట్లున్న ఏడు నెలల పిల్ల ( తనకు తెలుసు-అమ్మాయే!) అసహనంగా మెదులుతున్నట్లనిపించింది.

ఇంక ఒక్క క్షణం గూడా ఆలస్యం చేయకుండా దగ్గిరికి వేసి ఉన్న గేటు తలుపు నెట్టుకుని, నాపరాతి బండల మీదగా వడివడిగా అడుగులు వేసుకుంటూ క్రోటన్స్ మొక్కలు చుట్టి వేసిన వరండాలో నిలబడి, మొఖం మీదుగా కారుతున్న నీటి బొట్లను చూపుడు వేలితో నెట్టేసి, తరవాత చీర చెంగు కొద్దిగా పొడిగా ఉన్నట్లనిపించగా, దాంతో తుడుచుకొని, ఒక్కసారి ముఖం తిప్పి ఆ ఇంటి వంక, ఆవరణ వంక చూసింది.

ఆ ఇల్లు తన వీధిలో మొదటి ఇల్లు!

ఆ ఇంట్లో మొన్ననే ఎవరో రెండు లారీల సామానుతో దిగారు.

ఇవాళ వాళ్లతో ఇలా పరిచయం కాబోతున్నదన్న మాట!

అసలు తను త్వరత్వరగా ఇంటికి వెళ్లి ఉండవలసింది!

అమ్మ గిలగిలలాడుతుంటుంది ఈపాటికి. వానలో గొడుగు తీసుకొని బయలుదేరిందేమో కూడా తనని వెతుక్కుంటూ. అప్రయత్నంగా అటువైపుకు చూసింది మునికాళ్లమీద నిలబడి. దూరంగా తన ఇంట్లో వెలుగుతున్న లైటుపైన వెంటిలేటర్లోనించి కనబడుతూంది.

రేపు ప్రథమ పుట్టిన రోజుకు ఆమె

పి. ఎస్. నారాయణ

'నీవు వెళ్లి అందర్నీ పిలిచి రాలేవు. అందునా వట్టి మనిషివి గూడాగాదు' అని ఎంతగా చెప్పినా వినకుండా బయలు దేరింది.

అమ్మను బాధపెట్టింది; క్షణం బాధపడింది!

తరవాత కొత్తగా చేరిన ఆ ఇంట్లోని వ్యక్తులమీదికి మళ్లింది మనస్సు. ఇదివరకు ఆ ఇంట్లో సుభద్రమ్మ గారు ఉండేది. ఆయన రైల్వేలో ఇంజనీరు. ఆ కుటుంబమంతా తనకు తెలుసు. ఆయన రిటైరవటంతో వాళ్ల స్వంత ఊరు వెళ్లిపోయారు.

ఇప్పుడు వచ్చిన వాళ్లెవరో?

వాన జోరు మరీ ఎక్కువయింది.

తలుపు తనకు ఎవరన్నా వస్తారేమో? — ఏమో బాబు ... ఎవరంటూ! — సిగ్గుపడింది. కొద్దిగా తడిసిన సుశీల ముడుచుకుపోయింది.

ఏం రాసి. శుభ్రంగా బొట్టు పెట్టేసి, రేపు మా ప్రభ పుట్టిన రోజు. ఈ వీధి చివరినించి రెండో డాబావే మాది. రేపు మీరంతా పేరంటానికి రావాలి — చెప్పేస్తుంది.

మెరుపు మెరిసింది.

అసలు ఇంట్లో ఆడవాళ్ళు ఉన్నారా?

తను చూచినట్లే గుర్తు!

ఇంకా నాలుగడుగులు ముందుకువేసి తెరిచి ఉన్న కిటికీలోనించి లోపల ఎవరైనా కనబడతారేమో, చూడాలనిపించింది.

ఒక్క క్షణం సంశయించింది.

వానజల్లు తనమీది కోపాన్ని పులుము కుంటున్నట్లుగా తన్ని లోపలికి నెట్టేస్తూంది.

లోపల సరోజ కదులుతున్నట్లున్నది. ఏడుస్తున్నదేమో? (ఈసారి పుట్టే పిల్లకు ఆయనకు కోపం వచ్చినాసరే, 'సరోజ' అనే పెట్టాలి! ఎంత బాగుందా పేరు?) సిగ్గుతో ముఖం ఎర్రబడింది.

తల వంచుకొని, తడి మరకలతో ఉన్న చీరె కుచ్చెళ్లను సరిచేసుకుంది. లావుగా, అందంగా, తన చూపులు తనకే దిష్టి కలిగించేలా ఉన్న తననీ, తన శరీరాన్నీ చూచి గర్వపడింది!

తల ఎత్తి ఆకాశంలోకి చూచింది.

అమ్మ ఎంతగా ఆదుర్దా పడుతున్నదో?

ఇవాళ అసలే ఆయన సినిమాకి వెళతా నన్నారు.

అమ్మ ఏడుస్తూ కూర్చున్నదేమో? మనస్సు కలవరపడింది.

లోపలినించి ఒక్కసారిగా నవ్వులు వినబడ్డాయి...

ఉలిక్కిపడింది సుశీల.

కాళ్లను కిటికీ అయస్కాంతంలా లాగుతూంది.

ఎవరబ్బా వాళ్లు? ...

ఇంతా చేస్తే తనకు ఎప్పుడో పరిచయమైనవాళ్లే అయి ఉండరుగదా?

ఎన్ని జరగటంలేదలా? ...

ఒక్కసారి ఆమె బయటకు వస్తే బావుండును. ఇట్టే స్నేహం చేసుకోవచ్చు. . . అప్పుడు తనకు ఈ వీథిలో తెలియనివాళ్లే ఉండరు!...

ముూల గదిలోనించి మాటలు వినబడుతున్నాయి.

మగ గొంతు ... ఆడగొంతు ... ఎవరో పిల్లలు కూడా.... ఉన్నట్లున్నారు...

కిటికీ పక్కగా వెళ్లింది, మనస్సు నిలుపుకోలేక, కుతూహలాన్ని చంపుకోలేక.

మునికాళ్లమీద నిలబడుతూ, కొద్దిగా కష్టంగా ఉన్నా తెరిచి ఉన్న పై కిటికీ తలుపుల గుండా హాలు మధ్యగా వెలుగుతున్న లైటు వెలుగును కప్పుకున్న పరిసరాల్ని పరిశీలించసాగింది.

ఎదురుగా తలుపులు లేని అల్మయిరాలో ఏవో లావుపాటి బైండ్ పుస్తకాలు, స్విచ్ క్రిందగా టేబుల్, దానిమీద తెల్లటి క్లాత్, ఆ పైన రేడియో, ఫ్లవర్‌వేజ్, ఆష్‌ట్రే ...

అలమరాకు ఒకవైపు గ్రూప్‌ఫొటో, మరో వైపు ... మరో వైపు ... కళ్లు చించుకు చూచింది.

ఒక్కసారిగా శరీరానికి చెమట పట్టసాగింది.

ఆ ఫొటో... ఆ ఫొటో ...

ముఖం నల్లబడిపోయింది.

అసలే వట్టి మనిషి కూడా గాదు, బ్లడ్ ప్రెషర్ ఎగతన్నింది ...

అలాగే ఆయాసపడుతూ, రొప్పుతూ ఆ ఫొటోలోని వ్యక్తివంకే కన్నార్పకుండా చూస్తూంది...

ఈలోగా పక్క గదిలోంచి ఓ వ్యక్తి— కొత్తగా చేరిన ఆ ఇంటి యజమాని— ఆ హాల్లోకి వచ్చాడు...

ఆయన ముఖంలోకి సూటిగా చూచింది.

ఇంకెవరు?

ఆ ఫొటోలోని వ్యక్తే! ఆ విశాలమైన ముఖం, ఆ ముక్కు, ఆ పెద్ద నోరు ...

దూరాన పడుతున్న పిడుగు తననే వెతుక్కుంటూ మీదిమీదికి వస్తున్నదేమో ననిపించింది.

వడివడిగా కిటికీ పక్కనుండి ఇవతలకు వచ్చేసింది.

వాన కురుస్తున్నదే మరిచిపోయినట్లుగా, చీరె కుచ్చెళ్లయినా చేతో పట్టుకోకుండా, వరండా మెట్లు దిగి, గేటు వైపుకు పరుగెడుతున్నట్లుగా నడిచింది.

సుశీల రొప్పుతూంది.

ఇంతలోనే తలుపు తీసుకొని, వరండాలోకి వచ్చిన ఆయన, పోతున్న సుశీలను చూస్తూనే త్వరత్వరగా, "అరెరే.... ఉండమ్మా ఫరవాలేదు ... వాన తగ్గిన తరవాత వెళుదువుగాని!" అన్నాడు. తను అలా రావడం వల్లనే ఆమె వెళ్లి పోతున్నదేమో నని కించపడ్డాడు.

సుశీల చెవులకు అతడి మాటలు సోకలేదు. గేటు తీసుకొని, తిరిగి మూయనయినా మూయకుండా రోడ్డెక్కింది.

ఆమె గుండెల్లో సముద్రం ఘోషతో, ఉద్రిక్తతతో పొంగి పొరలుతూంది... ఆమె ఆ జోరు వానలో, అసహ్యపు రోడ్డుమీద ... పడతాననే భయం కూడా లేకుండా ... తడబడుతూ నడుస్తూంది.

అయిదు నిమిషాల నరకం అనుభవించింది...

డొక్క ఎగరేస్తున్నా, తలుపు తీసుకొని, తనకోసమే వేయికళ్లతో ఎదురు చూస్తున్న తల్లిని తప్పుకుంటూ ముందు గదిలోకి వెళ్లింది.

ఆమె పడుతున్న ఆయాసానికి తల్లి ఆదుర్దాపడింది.

సుశీలకు నోరు పిడచగట్టుకుపోయింది.

తల్లి సుశీలను పట్టుకుంది.

"అమ్మా! ... అమ్మా! ... నాన్న... నాన్నను చూచానే!" అన్నది. ఆ కంఠంలో భయం ఉన్నది; ద్వేషం ఉన్నది; అసహ్యమున్నది!

* * *

ఇరవయ్యేళ్ల జీవితం జానకిని జానకమ్మగా మార్చినట్లుగానే — అతి సున్నితమైన ఆమె హృదయాన్ని ఎవరూ, ఏలాంటి సంఘటనా ఏమీ చేయలేని ఇనప మొద్దులా తయారుచేసింది.

అందుకనే కూతురు సుశీల తను చూచిన విచిత్రాన్ని అంత ఆవేశంగా చెప్పినా కించిత్ ఆశ్చర్యాన్నిగాని, ఆవేశాన్నిగాని ప్రదర్శించలేదు ఆమె.

చాలా మామూలుగా అన్నది — "ఎక్కడ?"

కాని, ఒక్క క్షణం —

ఇరవై సంవత్సరాల క్రితం తనను రైలు ఎక్కించటానికి వచ్చిన ఆయన ముఖం కళ్ల ముందు కదిలింది.

సుశీలకు ఇంకా ఆవేశం తగ్గలేదు... "మన వీథిలోనే ... సుభద్రమ్మగారు ఉండి వెళ్లలేదూ ... ఆ ఇంట్లో ఉన్నారు!" రొప్పుతూనే అన్నది.

పుట్టిన తరవాత మొట్టమొదటిసారిగా చూచింది తండ్రిని. ఆ వేడి అది!


"అఁహాఁ ..." అని మాత్రం అని లోపలికి వెళ్లిపోయింది జానకమ్మ.

అంత తేలిగ్గా అన్నా, మనస్సును పని మీద లగ్నం చేయలేకపోయింది. మీదు మీదుగా పోతున్న వేడిగాలులు జీవితపు తెరల్ని తొలగిస్తూ వెక్కి నెట్టేస్తున్నాయి.

సుశీల ఈ భూమిమీద పడటం, తను ఒంటరిదవటం ఒక్కసారే జరిగినాయనిపిస్తూంది!

సుశీల పుట్టిన ఆరు నెలలకు, తనను స్టేషన్‌కు వచ్చి పంపిన భర్తయితే తిరిగి తీసుకువెళ్లేందుకు రాలేదుగాని, తన మరిది—ఆయన తరవాత ఆయన— "ఇక నీ భర్త నిన్ను ఏలుకోలేడమ్మా, వదినమ్మ తల్లీ!" అని చెప్పి పదివేల రూపాయల చెక్కుతో నోరు మూసేందుకు వచ్చాడు.

వెధవ పదివేలు చెక్కును అతగాడి



ముఖాన చించి విదిలించివేసింది!

తన తండ్రికి తను ఒక్కతే కూతురు. అలాంటి చెక్కులు పది ఇవ్వగలదు తను!

ఆ క్షణాలే ఆ వ్యక్తులకీ, తనకీ నడుమ కత్తెర్లు!

తరవాత అప్పుడప్పుడు గాలి వార్తలు వస్తూండేవి... ఎక్కడో మరో పెళ్ళి చేసుకున్నట్లు, మరేదో ఉద్యోగం వెలగబెడుతున్నట్లు...

తనే వారించింది తండ్రిని కోర్టులకీ, గీర్టులకీ వద్దని.

ఉత్సుకతతో అడిగింది సుశీలను జానికమ్మ, "ఎలా గుర్తుపట్టావే ఆయన్ని?" అని, రాత్రి మంచాలమీదకు చేరి.

ఇంకా అల్లుడు సినిమానుంచి రాలేదు.

"ఇప్పు డెలా ఉన్నాడో ఆయన?"

ఆయనతో గడిపిన ఒక్క సంవత్సరపు జీవితమే తన జీవితానికి వసంతం. నిజం! తన్ను భార్యగా చూచిన ఆ ఒక్క సంవత్సరం తన కాలు కింద పెట్టనీయ లేదు!

మరెందుకు పుట్టిందో ఆ దుర్బుద్ధి? ఇంకెందు కుంటుంది? — ఏ అమ్మగారో ఇంత మంత్రించి ఉంటుంది!

అమ్మగా రనుకుండే టప్పటికల్లా... ఆ వచ్చినావిడ ఎంత అందమైనదో అనే ప్రశ్న నెత్తిన ఎక్కి కూర్చున్నది!

సుశీల చెప్పిన తండ్రిని గుర్తించిన విధానం ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగించలేదు.

"ఆమెనుగూడా చూచావా?" అన్నది. కంఠంలో కొద్దిగా ఈర్ష్య తొంగి చూచింది.


సుశీల ఎగతాళిగా అన్నది, "ఒసేయ్, అమ్మా! మీ సవితిని ఒకసారి పలకరించి రారాదటే!" అని.

కొన్ని గంటలు మింగిన కాలం ఆమెలో వేడిని తగ్గించింది.

అప్పటికీ అలాంటి నిర్ణయానికి వచ్చిన జానికమ్మ, "చూద్దాంలే" అని నవ్వి ఊరుకుంది. ఆమె అందాన్ని చూడాలి!

సుశీల భర్త వచ్చాడు.

వెళ్ళి తలుపు తీసింది.



వరుసలు ఫోటో — ఎ. వి. వి. నరసింగరావు (నెల్లూరు)

పైకి నిశ్చలంగా ఉన్నా, తెల్లవార్లూ జానికమ్మకు కంటినిండా నిద్ర పట్ట లేదు. అటూ ఇటూ పొర్లుతూనే ఉన్నది.

ప్రతి క్షణం ఇరవై సంవత్సరాల క్రితం నాటి తన భర్త కళ్ల ముందు మెదులుతూనే ఉన్నాడు. ఆయన ఎదురుగా ఓ అజంతా శిల్పాన్ని కూర్చో పెట్టుకొని ఈర్ష్య పడుతూనే ఉన్నది.

అది మానవ సహజం కూడా!

మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు — అప్పుడు ఆయన ఇంట్లో ఉండడు అని అనుకున్న తరవాత—సుశీలకు సరిగ్గా ఆ ఇంటికే అనిగూడా చెప్పకుండా బయలుదేరింది.

ఇదివరకు సుభద్రమ్మగా రుండగా తను చాలా సార్లు ఆ ఇంటికి వెళ్ళింది.

అందుకే అతి సామాన్యంగా, ఏలాంటి ఉద్రిక్తతా లేకుండా బయలుదేరింది.

రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి.

కాని, ఆ ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ గుండె దడదడ లాడసాగింది.

లేనిపోని ఏ గొడవా జరగదు కదా?

ఏం జరుగుతుంది?

జరగనియ్యి చూద్దాం.

జీవితంలో తనకు జరిగిన నష్టానికి మించిన నష్టం మరేది జరగదు గదా?

గేటు లోపలికి వెళ్ళేటప్పుడు ఆయన ప్రేమ కాస్త మనస్సుకు ఇబ్బందిని కలిగించింది.

రాకుండా ఉంటేనే బాగుండేదేమో?

కాదు, అడుగులు ముందుకే పడ్డాయి.

గేటు మోతకు తలుపు తీసుకుని బయటకు వచ్చిన ఆ ఇంటి యజమానురాలిని ... తన సవితిని ... చూచినప్పుడు ఈర్ష్యతో కుదించుకుపోవలసింది పోయి, తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో ముందుకు అడుగులు వేసింది.

ఆమె అజంతా శిల్పమూగాదు, పాలరాతి విగ్రహమూ గాదు!

తన ముందు తీసికట్టే అనే భావన ఆమెను ఆవరించటంతో, ఆమె అంటే తెలియని లోకువతనం లోలున పెరిగిపో సాగింది.

ఆవిడకు అర్థంకాలేదు జానికమ్మ ఎవరో?

పక్కింటివాళ్లు అయి ఉండవచ్చని, "రండి!" అంది, సాదరంగా నవ్వును ముఖంమీద చిందిస్తూ.

ఎంత చిన్నగా నవ్వటానికి ప్రయత్నించినా, ఆమె ఎత్తుపళ్లు ఆమెను, ఆమె ముఖాన్ని వికృతపరిచినాయి.

జానికమ్మకు నవ్వు వచ్చింది ఆమె నవ్వుముఖం చూచి!

చిన్నగా నవ్వి ఊరుకుంది.

ఆమె చాప వేస్తూ, "నాకు చాలా సంతోషంగా ఉందండీ ... కొత్త ప్రదే శానికి వెళుతున్నప్పుడల్లా నాకు భీ భయం, కొత్త వాళ్లతో ఎలా పరిచయం చేసుకోవాలా అని. నేను బయలుదేరుదా మంటే ముగ్గురు పిల్లల్ని వెంట వేసుకు బయలుదేరాలి..." అని అల్లోక్తిలో ఆగి పోయింది.

ఆ కంఠంలో పిల్లలు అని వెలుతు న్నప్పుడు కాస్తంత గర్వం తొంగిచూసిన ట్లనిపించింది.

'ఓ సవితమ్మా! నేను గడిపిన ఒక్క సంవత్సరం జీవితంలోనే నాకో పిల్ల పుట్టిందమ్మా! ఆ పిల్లకు మరి కొద్ది రోజుల్లో ఓ అద్వితీయురాలు (అల్లుడు చెప్పినట్లుగా అమ్మాయే అయితే— అలా కావాలి గూడా — ప్రియంవద అని పేరు పెట్టుకోవాలి) కూడా పుట్టబోతోంది. ఇన్నాళ్ల జీవితంలో ముగ్గురు పుట్టటం గూడా ఏమంత గొప్ప, ఓయమ్మా!' అని అవాలవిసించింది.

ఆవిడా కూర్చుంది ఎదురుగా చాప మీద.

జానికమ్మకు ఎలా మాట్లాడాలో, ఎలా మాట్లాడించాలో అర్థంకాలేదు.

ఒకటి మాత్రం నిజం—జానికమ్మ అక్కడకు వచ్చిన తరవాత కొద్దిగా మనస్సు తేలిక పరుచుకున్నది. 'తన సవితి తనంత అందగత్తె మాత్రం కాదు!'

తనకు అందగత్తె కాకపోతేనేం, ఆయనగారి కళ్లకు ఈవిడ రంభో, ఊర్వశో!

ఎవరి పిచ్చి వారి కానందం!

"ఏ ఊరినుంచి వచ్చారేం?" ఏదో అడగాలన్నట్లుగా అడిగింది.

"మద్రాసునుండి వచ్చామండి. నాకు ఏడుపొచ్చిందనుకోండి. పదేళ్ళ ఉన్నామో లేదో... అందులో అక్కడ మా ఇంటివాళ్ళు ఉన్నారంటే ... నాకు చెల్లెల్లా ఉండే దామె..."

'పక్కింట్లోనా?' అందామను కున్నది జానికమ్మ.

తల ఎత్తి నాలుగు వైపులా చూచింది. అలమరాకు పక్కగా వేసి ఉన్న ఆయన ఫొటోను — అతి సామాన్యంగా రోజూ చూచే ఏదో వస్తువు చూచినట్లుగా ఒక్క క్షణం చూచి తల దించుకుంది.

చిన్నగా మనస్సుకు బాధ పులుముకో సాగింది.

తెలియని ఈర్ష్య...

తనకు లేనిది ఆవిడ ఏదో అనుభవిం చేస్తూంది . . . ఒక్క క్షణం తపన పడింది. . . ఒళ్లంతా చెమట పట్టింది.

ఆవిడ లేచి, "అదేమిటి ... గాలి రావటం లేదా? ఇబ్బంది పడుతున్న ట్లున్నారు! ఫాను తెచ్చిపెడతా

నుండండి .. ఇంతకీ చెప్పనే లేదు. మా పక్కిళ్లేనా మీది ...'' ఫాను తెచ్చి, ప్లగ్ పెట్టి ఆన్ చేసింది. ''రేంట్లో పనిచేస్తుంటారు మీవారు?''

జానికమ్మ తడబడింది. ఏం చెప్పాలో తెలీక ఓ లిప్తకాలం తెల్లముఖం వేసింది. ''ఇక్కడ మా అమ్మాయి ఉంది. ఈ వీథిలో చివరనించి రెండో ఇల్లే మాది!'' అన్నది.

''ఒక్క క్షణం కూర్చోండి. ఇప్పుడే వస్తాను...కాఫీకి నీళ్లు పడేసి!'' అన్నది ఆమె వంటింట్లోకి వెళ్లబోతూ.

''వద్దమ్మా! వద్దు, వద్దు ... నేను వెళతాను.'' కొత్త ఊహల్లో మనిషి తనను తాను మరిచిపోయింది. ''అసలు ఇంతకీ చెబుదామనుకున్న దేమిటంటే విన్న సామానులు దింపుకుంటూండగా ఆయన్ని చూచాను. ఇంతా ఏడిస్తే నాకు తెలిసినాయనే ... కొన్నాళ్లు కలిసి మెలిసి తిరిగాం. జానికమ్మ వచ్చి వెళ్లిం దని చెప్పమ్మా!'' తడబడింది. గొంతు కొరబోయింది. ''జానకి అని చెప్పులే!'' అని తిరిగి ఆమె ముఖంలోకి చూడ కుండా, ఏదో తప్పు చేసినదానిలా వణికి పోతూ బయటకు వచ్చేసింది.

*   *   *

సాయంత్రం ఆరు గంట లయింది.

అప్పుడే పాలవాడు వచ్చి పాలు పోసి వెళ్లాడు.

జానికమ్మ మనస్సు అస్తవ్యస్తంగా ఉన్నది.

తెగని ఆలోచనలు. వాటి నడుమ వింత బాధ, తెలియని తేలికదనం.

ఎందుకు ఇదంతా?

సర్వం మరిచిపోయి కొత్త ప్రపం చంలో తిరుగుతున్న తనకు ఓ వికారపు భావన!

ఇంటికి వచ్చిన ఆయనకు ఆ పక్కింటి ఊర్వశి, ''ఎవరో జానకిట ... మీకు తెలుసునట. వచ్చి వెళ్లిందని చెబితే!'' ఆయన ఒక్క క్షణం నుదురు చిట్లించి, గడిచిపోయిన జీవితాన్ని ఆలోచనల లోతు లతో కెలకవచ్చు... చప్పున ఆమె ఎవరో గుర్తుకు రాకనూ పోవచ్చు...

ఊహూఁ...

ఎందుకు గుర్తుకు రాదు!

తనతోనూ వెలగబెట్టాడు గదా ఓ సంవత్సరం సంసారం!

ఒక్క క్షణం ఆ సంవత్సరపు వెన్నెల మీద మనస్సంతా పరుగులెత్తింది.

తన జీవితంలో అంతటి సుదినాలు... పెళ్లి కాకముందు గూడా చూడనివి... తరవాత ఎలానూ లేవు. చాలా కాలం ... ఊహూఁ ... ఎల్లకాలం బంగారు భరిణలో భద్రపరుచుకుంటుంది.

'కాని, పక్కింటి తిలోత్తమలో ఏదో మంత్ర శక్తి ఉండి ఉండాలి!'

నవ్వుకున్నది జానికమ్మ.

ఆ రోజు...ఆ క్షణంలో కావాలని అద్దంలో తరిచి, తరిచి నలభయి ఏళ్లకే జానికమ్మయిన జానకి, ఒక్క తెల్ల వెంట్రుకయినా కనబడుతుందేమో నని తన ఒత్తయిన తలకట్టులోకి చూపులు చించుకు చూచింది.

ఒక్కటీ లేదు.

కానీ ఆమె జానికమ్మే!

ఊరు ఊరంతా కోడై కూసింది, ''జానికమ్మని మొగుడు వదిలేశాట్ట'' అని!

ఆ తరవాతే...ఆ ఊరే 'జానికమ్మ' అని పిలిచింది!

పోయిన తల్లీ, తండ్రీ జానికమ్మను తమకున్న చిన్న సామ్రాజ్యానికి మహా రాజ్ఞిని చేశారు.

వాళ్లు పోయినా ఆమెకు అంతగా దుఃఖం కలగలేదు. చెట్టంత మొగుడే తనను కాదన్నప్పుడు వీళ్లు ఉండీ ఎంత, లేక ఎంత?

రాజఠీవితో తన సామ్రాజ్యాన్ని పెంచుకున్నది. చిన్న రాణివారిని పెంచి, పెద్దచేసి, చూడ ముచ్చటయిన, ఏమీలేని ఓ చిన్నవాడి కిచ్చి వివాహంచేసి, కట్టు తప్పకుండా గిరిగీసి బంధించివేసింది!

జానికమ్మ అద్దంలో చూచుకుంటున్న నలభై ఏళ్ల జానకి నవ్వు పెదవులమీద ఒలకబోసుకున్నది.

[illegible] చూచుకుంది ... ఎందుకో అప్రయత్నంగా చేతులు గుండెలమీదుగా పడ్డాయి, అప్పుడప్పుడు భర్తను గుర్తు తెచ్చే మంగళసూత్రాలను కప్పివేస్తూ ...

ఈ సారి ఆయనే వస్తారేమో — ఓ ఐదు వేల రూపాయల చెక్కుతో తనను ఈ వీథిలోంచి, లేదా ఈ ఊళ్లోంచి వెళ్లిపొమ్మని చెప్పటానికి ...

రానీయ్ ... ఈసారి శుభ్రంగా తీసేసుకుంటే సరి!

ఫక్కున నవ్వింది.

ఇంతలో తలుపు చప్పుడయితే, పక్క గదిలో ఏదో పని చేసుకుంటున్న సుశీల భర్తేమోనని వచ్చి తలుపు తీసింది...

కాదు—ఆయన!

కలవరపడిపోయింది సుశీల.

ఆయోమయంగా ఆయన ముఖం లోకి చూస్తూ పిచ్చిగా, ''అమ్మా'' అని పిలిచింది.

చటుక్కున కోపం గుండెల్లో మంటల్లా ఎగతన్నగా, రెండడుగులు వెనక్కి వేసి, తీక్షణంగా ఆయన ముఖంలోకి చూస్తూ, ''ఎందుకు వచ్చారు మీరు?'' అన్నది.



ఊరికి                ఫోటో—వర్మ రామదాస్ (మద్రాస్-4)

ఇరవై సంవత్సరాల నుండీ తమ ఉండీ తమను అనాథలుగా చేసిన ఆయన మీద కోపం బుసలు కొట్టసాగింది.

ఆయాసం లోపల్నించి మనిషిని నమిలి [illegible].

కోపంతో కళ్లు ఎర్రబడ్డాయి.

''అదే అడుగుతున్నాను ... చెప్పరేం మీరు? ... ఎందుకు వచ్చారు? ... ఇరవై సంవత్సరాల క్రితం వదిలిపెట్టి వెళ్లిన మీ భార్య ఎలాగుందో చూద్దా మనా? ... లేక ఆ నాటి మీ చిన్నారిగా పువ్వుల్లో పెట్టి పూజించుకుంటున్న నన్ను చూచి ఈర్ష్యతో పాలలాంటి మా జీవితంలో విషం కలిపేందుకా? నాకు అక్కర్లేదు ... నాకు నాన్న అక్క ర్లేదు... అమ్మ ఒడిలో, చేతుల్లో తల్లి ప్రేమ చూచుకున్నాను ... అమ్మ ముఖం చూస్తూ నాన్నను మించిన అను భూతిని పొందాను... నాకు మరో నాన్న అక్కర్లేదు ... నాకు ఆమే అమ్మా, నాన్నా ... వద్దు ... వెళ్లిపోండి మీరు... మళ్లీ రావద్దు ... మీ ముఖం నాకు చూపించవద్దు.'' ఆవేశంతో ఊగి పోసాగింది.

కళ్లు గిర్రున తిరగసాగినాయి.

అక్కడే కూలిపోయింది. లేవలేని సుశీల అక్కడే గబుక్కున కూర్చుండి పోయింది, ఆయాసంతో పొట్ట ఎగిరెగిరి పడుతూండగా తట్టుకోలేక!

''వద్దు ... వద్దు ... మిమ్మల్ని నేను చూడలేను... నేను నాన్న అనుకో లేను... వెళ్లిపోండి ... పోండి!'' చేతులు అడ్డంగా ఊపుతూ పెద్దగా అరవసాగింది.

జానికమ్మ ఆయన్ని చూసింది.

క్షణంలో గుర్తించింది.

ఆమె ముఖం తెల్లగా పాలిపోయింది!

కూతుర్ని వారిస్తూ ఏదో చెప్ప బోయింది.

అడుగు ముందుకు వేసిగూడా, సుశీల ఆవేశానికి బెదిరింది, నోట మాట పెగలక, కూతుర్ని వారించలేక అలాగే శిలావిగ్రహంలా నిలబడిపోయింది.

ఆయన ఒక్క అడుగు ముందుకు వేశాడు. జాలిగా పడిపోయిన సుశీలవంక చూస్తూ, 'పొరబాటే పడ్డావమ్మా! నేను ... నేను మీనాన్నను గాదమ్మా... మీ చిన్నాన్నను!' అని చెప్పాలన్నా భయం గుండెల్ని రంపంలా కోయ సాగింది. అది చెప్పిన తరవాత మిగతాది గూడా చెప్పక తప్పదు. కాని, లక్ష్మీదేవిలా ముఖాన కుంకుమతో, ఏనాడో తెగతెంపులు చేసుకున్నా, ఎక్కడైనా ఉన్నాడు గదా అనే తృప్తితో మెళ్లో గుండెల్ని ఆదుకుంటున్నట్లుగా ఉన్న మంగళసూత్రాలతో ఉన్న వదినను ఎదురుగా నిలబెట్టుకొని, 'మీ నాన్న సంవత్సరం క్రితం చనిపోయాడు, తల్లీ!' అని ఆయన కూతురికి ఎలా చెప్పాలో అర్థంకాలేదు అతడికి! ★